రబీలోనైనా కలిసొచ్చేనా.?


నూర్చిన ధాన్యాన్ని కళ్లాల్లో ఎండబెడుతున్న రైతులు

మాడుగుల: గత ఖరీఫ్‌లో వంట కోత దశలో వరు ణుడు దెబ్బకు దాదాపు 50 శాతం మంది రైతులు నష్టపోయారు. రబీ పంటపై మళ్లీ రైతులు దృష్టి సారించి మండలంలో సుమారు 4,500 ఎకరాలలో వరి సాగు చేపట్టారు. ప్రస్తుతం చేలన్నీ కోత దశకు చేరుకున్నాయి. ఈ క్రమంలో మళ్లీ ఈదురుగాలు లతో కూడిన వర్షపు జల్లులు కొద్ది రోజులుగా పడు తుండడంతో ఆందోళన చెందిన పలువురు రైతులు ముమ్మరంగా వరికోతలు చేపడుతున్నారు. మరి కొంత మంది కోసిన వరి చేలును యంత్రాలతో నూర్పిడి చేసి గింజలు ఎండబెడుతున్నారు. రెండెక రాలు మించి పండిన రైతులు ఆధునిక యంత్రంతో కోత, నూర్పిడి ఒకేసారి చేపడుతున్నారు. రబీలో పండిన ధాన్యంకు టన్ను రూ.18వేలుకు మించి ధరలు పలకలేదు. ప్రభుత్వం తరపున ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం, మద్దతు ధర లభించక అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముమ్మరంగా రబీ వరి కోతలు

కానరాని ధాన్యం కొనుగోలు కేంద్రాలు

మండలంలో 4500 ఎకరాల్లో కోత దశలో వరి చేలు

దళారులు ఆడింది ఆటగా ధరలు



గాదిరాయిలో వరి నూర్పు చేస్తున్న రైతులు

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఎక్కడ?

చెరువులు, మోటార్లు అందుబాటులో ఉన్న చోట్ల రబీ వరి సాగు చేపట్టారు. ఈ ఏడాది రబీ వరికి మంచు దెబ్బ తగిలి తెగుళ్ల ఆశించడంతో దిగుబడి ఆశించిన స్థాయిలో రాలేదు. ప్రస్తుతం ముమ్మరంగా వరి కోతలు సాగుతున్నాయి. వెంట వెంటనే నూర్పు పనులు చేస్తున్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో దళారులు ఆడింది ఆట.. పాడింది పాటగా మారిందని రైతులు దిగులు చెందుతున్నారు. మరోవైపు వాతావరణం కూడా బాగుండకపోవడంతో వేరే మార్గం లేక దళారులుకే కట్ట బెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. రైతులకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఏడాది కాలంగా ఎటువంటి పంట సహాయం అందలేదు. ఈ విషయమై వ్యవసాధికారి వాసుదేవరావును సంప్రదించగా.. రబీలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి ఇంకా ఎటువంటి అనుమతి రాలేదన్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

రైతులకు ప్రభుత్వ సహాయం అందలేదు. వర్షాలతో ఖరీఫ్ పంట నష్టపోయాం. రబీలో కూడా కోత దశకు చేరుకునే సరికి వర్షాలు ప్రారంభమయ్యాయి. ఎలాగోలా గింజలు నూర్పిడి చేసి ఆరబెడితే ధాన్యాన్ని దళారులు టన్ను రూ.18 వేలు నుంచి రూ.19 వేలు లోపు అడుగుతున్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి టన్నుకు రూ.22 వేలు మద్దతు ధర ప్రకటించి రైతులను ఆదుకోవాలి.
– నలాది అచ్యుంనాయుడు, రైతు, గాదిరాయి


సత్యవరంలో యంత్రాలతో రబీ వరి కోతలు నూర్పిడి చేస్తున్న దృశ్యం

మద్దతు ధర ప్రకటించాలి

మండలంలో దాదాపు రబీ వరి చేలు కోత దశకు చేరుకున్నాయి. మంచు వల్ల వరికి పచ్చ పురుగు ఆశించి పంట దెబ్బతింది. మందులు పిచికారీ చేస్తున్నా తెగుళ్ల నివారణ కాలేదు. ప్రభుత్వం స్పందించి రబీలో కూడా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర ప్రకటించాలి.
– నాగేశ్వరరావు రైతు . సత్యవరం,

క్లుప్తంగా

ఎం.కోడూరు మోదమాంబ ఆలయానికి విరాళం

మాడుగుల రూరల్: ఎం.కోడూరు మోదమాంబ ఆలయ అభివృద్ధికి పాడేరు గ్రామానికి చెందిన బంగారు వర్తకుడు నవర బబ్లూ రూ.10 వేలు విరాళంను మంగళవారం అందజేశారు. ఈ విరాళాన్ని ఆలయ కమిటీ అధ్యక్షులు, సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావుకు అందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గెంజి రాజేశ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు ముమ్మిన రమణబాబు, పడాల అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరు వృద్ధాశ్రమంలో వైద్య శిబిరం

రోలుగుంట: రోలుగుంట పీహెచ్‌సీ వైద్యాధికారి కె.ధనలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం కొవ్వూరు శ్రీవెంకటేశ్వర వృద్ధాశ్రమంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఇక్కడున్న 25 మంది వృద్ధులకు నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి ఆర్థోపెడిక్ వైద్యుడు విద్యాసాగర్, జనరల్ డాక్టర్ లత అవసరమైన ఆరోగ్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో కృష్ణ, హెల్త్ సూపర్‌వైజర్ షాజహాన్, సంస్థ నిర్వాహకుడు యర్రంశెట్టి రాజారావు, సర్పంచ్ కాంతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో అదనపు భవనాలు ప్రారంభం


భవన ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బండారు

కె.కోటపాడు : కింతాడలోని కేజీబీవీలో అదనపు భవనాల సముదాయాన్ని మంగళవారం ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ప్రారంభించారు. భవన నిర్మాణంతో పాటు మౌలిక వసతుల కల్పనను రూ.1.31 కోట్ల నిధులు కేటాయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి జి.అప్పారావునాయుడు, సమగ్ర శిక్ష ఈఈ నరసింహారావు, రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్, డైరెక్టర్ రొంగలి మహేష్, సర్పంచ్ బండారు ముత్యాలనాయుడు, ఎంపీటీసీ పల్లా కన్నమ్మ, కేజీబీవీ ప్రిన్సిపాల్ బి.చిన్నమ్ములు పాల్గొన్నారు.

పరిదేశమ్మతల్లి దర్శనానికి పోటెత్తిన భక్తులు

బుచ్చెయ్యపేట: మండలంలో పొట్టిదొరపాలెం గ్రామంలో పరిదేశమ్మతల్లి పండగ మంగళవారం ఘనంగా జరిగింది. అమ్మవారి దర్శనం కోసం భక్తులు అధిక సంఖ్యలో బారులు తీరారు. భక్తులకు పులిహోర, మజ్జిగ పంపిణీ చేశారు. ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం దాతలు కురందాసు ఎరుకునాయుడు, అప్పలనాయుడు, వీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వడ్డి సత్యారావు ఏర్పాట్లు చేశారు.

చెరువులో ఉపాధి పనుల పరిశీలన

బుచ్చెయ్యపేట: దిబ్బడి గ్రామంలోని బంటువారి చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను సర్పంచ్ పెదిరెడ్ల మాణిక్యం, వైస్ ఎంపీపీ గొంప చినబాబు మంగళవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ మండపాక శివ, మాజీ ఎంపీటీసీ సభ్యుడు గొన్నాబత్తుల శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థికి ఘన సత్కారం


రేవతిని సత్కరిస్తున్న వైస్ ఎంపీపీ మత్స భవానీప్రసాద్, ఉపాధ్యాయులు

రావికమతం: కేజీబీవీ గర్నికంలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 433 మార్కులు సాధించిన కోళ్ల రేవతిని టి.అర్జాపురం పంచాయతీ చిలకవానిపాలెంలో వైస్ ఎంపీపీ భవానీప్రసాద్, ఉపాధ్యాయులు మంగళవారం ఘనంగా సత్కరించారు. రేవతి ఒకటి నుంచి 5వ తరగతి వరుకు చిలకవానిపాలెం ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంది. ఇటీవల విడుదలైన ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాలలో బైపీసీలో 433 మార్కులు సాధించి రాష్ట్రంలో కేజీబీవీల్లో మూడో స్థానంలో నిలిచింది. ఈ మేరకు రేవతిని సత్కరించి జ్ఞాపిక బహూకరించారు.

48 మందికి వైద్య పరీక్షలు

రావికమతం: కొత్తకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో చీమలపాడు పంచాయతీ గిరిజన గ్రామం కొంజుర్తిలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 48 మందికి వైద్యాధికారి మోహిని సురేఖ పరీక్షలు చేశారు. ఇద్దరు జ్వర పీడితులకు రక్త పరీక్షలు చేశారు. అవసరమైన మందులు అందజేశారు. మలేరియా, డెంగ్యూ వ్యాధులపై గిరిజనులకు అవగాహన కల్పించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి పాతాళ రామారావు, వైద్య సిబ్బంది జోషి, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేస్తేనే గుర్తింపు


ఎర్రునాయుడును సన్మానిస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాసులనాయుడు, డీఈవో అప్పారావునాయుడు

కె.కోటపాడు : సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు అన్నారు. కె.కోటపాడు హైస్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పని చేస్తూ ఉద్యోగ విరమణ చేస్తున్న బి.ఎర్రునాయుడు సన్మాన కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్సీ మాట్లాడుతూ అంకితభావంతో పని చేసే ఉపాధ్యాయులకే సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. డీఈవో అప్పారావునాయుడు మాట్లాడుతూ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని అందుకోవడంతో పాటు సామాజిక సేవల్లోనూ ఎర్రునాయుడు ముందుంటూ పలువురికి స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. అనంతరం ఎర్రునాయుడును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, ఎంఈవోలు సత్యనారాయణ, డీవీడీ ప్రసాద్, హెచ్ఎం పద్మావతి పాల్గొన్నారు.

గ్రామాల్లో పక్కాగా ప్రొటోకాల్ పాటించాలి

- మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే బండారు ఆదేశం
- పలు సమస్యలపై గళమెత్తిన పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు



సమస్యలపై ఎమ్మెల్యే బండారును ప్రశ్నిస్తున్న బోలయికింతాడ సర్పంచ్ బూరె బాబూరావు

దేవరాపల్లి: గ్రామాల్లో ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించేటప్పుడు అధికారులు విధిగా స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ, తదితర ప్రజాప్రతినిధులకు సమాచారం అందించి, పక్కాగా ప్రొటోకాల్ పాటించాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఆదేశించారు. ఈ మేరకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో బోయిలకింతాడ సర్పంచ్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబూరావు మాట్లాడుతూ బి.కింతాడ గ్రామంలో లేని వ్యక్తికి రాయితీ నూర్పిడి యంత్రం మంజూరు చేయడంతో పాటు సదరు యంత్రాన్ని బినామి వ్యక్తికి ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేయడం దారుణమన్నారు. బోయిలకింతాడలో పాఠశాల స్థలంలో ఆక్రమణలు తొలగించాలని ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ అధికారులు ఇరువర్గాలతో మాట్లాడి వాస్తవ పరిస్థితుల ఆధారంగా సమస్యను పరిష్కరించాలని సూచించారు. ఎ.కొత్తపల్లి సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ మాట్లాడుతూ స్థానిక హైస్కూల్‌లో గతంలో స్థలం దానం చేసి, ప్రస్తుతం ప్రహరీ నిర్మాణానికి కొందరు ఆటంకం కలిగిస్తున్నారన్నారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ ఇరువురితో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రైవాడ సర్పంచ్ చల్లా లక్ష్మి మాట్లాడుతూ గ్రామంలోని యూపీ స్కూల్‌ను మోడల్ ప్రైమరీగా మార్పు చేయడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, తమ పాఠశాలను హైస్కూల్‌గా మార్పు చేయాలని కోరారు. రైవాడ సచివాలయ భవన నిర్మాణానికి సంబంధించి రూ.2.36 లక్షల నిధులను వెనక్కి రప్పించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి తక్షణమే విచారణ జరిపి సదరు పంచాయతీ సెక్రటరీపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోను ఆదేశించారు. సర్పంచ్‌లు గుడెపు రాము, నాగిరెడ్డి శరారి నాయుడు, జెడ్పీటీసీ కర్రి సత్యం, కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్, వైస్ ఎంపీపీ ఉర్రూకుల గంగాభవానీ, తహసీల్దార్ పి.లక్ష్మీదేవి, ఎంపీడీవో ఎంవీ సువర్ణరాజు, పరిపాలన అధికారి డీవీ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సందడిగా మోదకొండమ్మ వీధి పండగలు


ఘటాలతో ఆలయానికి కాలి నడకన వెళ్తున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సతీమణి రమణమ్మ, తదితరులు

మాడుగుల: ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ వీధి పండగలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సతీమణి రమణమ్మతో స్థానిక సర్పంచ్ ఎడ్ల కళావతి, వెంకటేశ్వర్లు దంపతులు ఆధ్వర్యంలో 101 మంది భక్తులు అమ్మవారి ప్రతి రూపమైన ఘటాలను శిరస్సున పెట్టుకుని అమ్మవారి ఆలయానికి కాలి నడకన చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రమణమ్మ, కళావతిని ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కుక్కర మహేశ్వరి, వార్డు మెంబరు శీలామంతులు జ్యోతి, అధిక సంఖ్యలో మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు వద్దు.. పాత మీటర్లే ముద్దు


నిరసన తెలుపుతన్న సీపీఎం నాయకులు

మాడుగుల రూరల్: విద్యుత్ చార్జీలు పెంచబోమని కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీని తుంగలోకి తొక్కి అధికారంలోకి వచ్చిన తర్వాత స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసి వినియోగదారులపై భారం మోపడంపై సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. మాడుగుల బస్టాండు ఆవరణలో స్మార్ట్ విద్యుత్ మీటర్లు వద్దు.. పాత మీటర్లు ముద్దు అంటూ వాల్ పోస్టర్లు పట్టుకుని సీపీఎం నాయకులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి ఇరటా నర్సింహమూర్తి మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు టీడీపీ నాయకులు స్మార్ట్ మీటర్లు వద్దని, వాటిని పెడితే పగలుగొట్టాలని పిలుపునిచ్చారని, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం షాపులు, ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని చెప్పారు. విద్యుత్ బిల్లులో రూ.15 వేలు వాయిదా పద్ధతిలో వసూలు చేయడం దారుణమన్నారు. 2022–23లో విద్యుత్ బిల్లులు చెల్లించినా సరే సర్దుబాటు చార్జీలు పేరుతో భారం వేయడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కర్రి నాగరాజు, గాలి కిరణ్‌కుమార్, షేక్ చాందిని, మహేశ్, పెంటోజి పాల్గొన్నారు.

ఘనంగా షిర్డీసాయిబాబా ఆలయ వార్షికోత్సవం


స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న గోవాడ సుగర్స్ ఎండీ సన్యాసినాయుడు

చోడవరం: వెంకన్నపాలెం షిర్డీ సాయిబాబా ఆలయ 26వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. గోవాడ సుగర్ ఫ్యాక్టరీకి చెందిన ఈ ఆలయంలో స్వామివారికి పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ వి.సన్యాసినాయుడు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఉదయం నుంచి సాయినాథునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల నడుమ సాయంత్రం ప్రత్యేక రథంపై స్వామివారి తిరువీధి కనుల పండువగా సాగింది. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. ఫ్యాక్టరీ ఎండీ పీఏ రవి, ఏవో వర్మ, యూనియన్ నాయకులు కేవీవీ భాస్కరరావు, శరగడం రామునాయుడు పాల్గొన్నారు.

రోగులకు సకాలంలో వైద్య సేవలు అందాలి


ఆపరేషన్ థియేటర్‌ను తనిఖీ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్యోతి

మాకవరపాలెం: రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్యోతి వైద్య సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని బూరుగుపాలెం పీహెచ్‌సీని ఆమె మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ చేసి, ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పీహెచ్‌సీలో జరిగే ప్రసవాల సంఖ్యను తెలుసుకున్నారు. గర్భిణులకు అందుతున్న సేవలు, తదితర అంశాలపై వైద్యాధికారి చరిష్మాతో మాట్లాడారు. నిత్యం గ్రామాల్లో సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని, పీహెచ్‌సీలో రోగులకు సకాలంలో సేవలు అందించాలని ఆదేశించారు.

ఘనంగా గంగాలమ్మతల్లి పండగ


గంగాలమ్మతల్లిని దర్శించుకుంటున్న ఉప సర్పంచ్ అప్పలరాజు, గ్రామ పెద్దలు

నాతవరం: మండల కేంద్రం నాతవరంలోని శ్రీగంగాలమ్మ తల్లి పండగను భక్తులు మంగళవారం ఘనంగా జరుపుకొన్నారు. అమ్మవారికి పసుపు, కుంకమ, జాకెట్ ముక్క సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఆలయ ప్రాంగణంలో ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అమ్మవారిని వైఎస్సార్‌సీపీ జిల్లా యాక్టివిటీ కార్యదర్శి, నాతవరం ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, గ్రామ కమిటీ అధ్యక్షుడు శెట్టి లచ్చబాబు, గ్రామ పెద్దలు, అధిక సంఖ్యలో మహిళలు దర్శించుకున్నారు.

విద్యార్థుల ప్రవేశాల బాధ్యత అందరిదీ

నాతవరం: పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించే విషయంలో నిర్లక్ష్యం చేయొద్దని ఎంఈవోలు సత్యనారాయణ, కామిరెడ్డి వరహాలబాబు అన్నారు. ఎంఆర్‌సీ భవనంలో మంగళవారం సీఆర్పీలతో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఒకటో తరగతి నుంచి విద్యార్థులను చేర్పించే బాధ్యత అందరిపై ఉందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల నుంచి పాఠశాలల్లోకి, అక్కడ్నుంచి హైస్కూల్‌కు వివిధ దశలో చదువుతున్న విద్యార్థులను ఎక్కడ మిస్ కాకుండా చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో చమ్మచింత హైస్కూల్ హెచ్ఎం కాశపు శివరాంప్రసాద్, సీఆర్పీలు పోలుపర్తి నాగేశ్వరరావు, గోవింద్ వెంకటలక్ష్మి, సత్యవేణి, ఎంఆర్‌సీ కోఆర్డినేటరు అంకంరెడ్డి శ్రీనివాస్‌నాయుడు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం


అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన స్టాల్

నాతవరం: తక్కువ ఖర్చుతో అధిక విటమిన్లు ఉండే ఆహారం తీసుకుంటే ఆరోగ్యవంతంగా ఉంటారని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారులు 7వ పౌష్టికాహార పక్షోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. తక్కువ ఖర్చుతో లభ్యమయ్యే పోషకాలతో తయారు చేసిన వంటకాలను అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముందుగా గొలుగొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు బీపీఏ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఐసీడీఎస్ శాఖ అందించే సేవలపై అవగాహన కల్పించారు. ఎంపీపీ మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు ఎంతో కాలంగా ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం స్పందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ పోలుపర్తి పార్థసారథి, ఎంఈవో కామిరెడ్డి వరహాలబాబు, తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కె.సత్యనారాయణ, ఐసీడీఎస్ నాతవరం, గన్నవరం. వై.డి.పేట సెక్టార్ల సూపర్‌వైజర్లు విజయలక్ష్మి నాగజ్యోతి, సూర్యప్రభ పాల్గొన్నారు.

అందరూ మొక్కలు నాటాలి


చెట్లకు క్యూర్ కోడ్ ఏర్పాటు చేస్తున్న విద్యార్థులు

మాకవరపాలెం: అందరూ మొక్కలు నాటాలని తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం కె.రాము కోరారు. పాఠశాలలో మంగళవారం ధరిత్రి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో ఉన్న చిన్న, పెద్ద మొక్కలను వేరుచేసి, వాటిని సంరక్షించేలా విద్యార్థులకు సూచించారు. విద్యార్థులతో వాటికి శాస్త్రీయ నామాలను పెట్టించడంతో పాటు క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటు చేశారు. ఏటా పెరుగుతున్న భూమి వేడిని తగ్గించేందుకు మొక్కలను విరివిగా పెంచాలని కోరారు. ఇళ్ల వద్ద మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లోవరాజు, సంతోషి పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ వెంకటరమణ మృతికి సంతాపం


మాజీ సర్పంచ్ వెంకటరమణ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్, (ఇన్‌సెట్) మాకిరెడ్డి వెంకటరమణ (ఫైల్)

నాతవరం: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, చెర్లోపాలెం మాజీ సర్పంచ్ మాకిరెడ్డి వెంకటరమణ(56) మరణించడం పార్టీకి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. మూడు రోజుల కిందట అనారోగ్యానికి గురైన వెంకటరమణ మంగళవారం ఉదయం విశాఖలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ 2001లో సర్పంచ్‌గా గెలిపొందారు. రెండు పర్యాయాలు చెర్లోపాలెం సర్పంచ్‌గా పని చేశారు. తర్వాత వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి మండల స్థాయిలో చురుగ్గా వ్యవహరించేవారు. ప్రస్తుతం ఆయన కుమార్తె పైల శిరీష చెర్లోపాలెం సర్పంచ్‌గా ఉన్నారు. వెంకటరమణ మృతదేహన్ని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, జెడ్పీటీసీ సభ్యురాలు కాపారపు అప్పలనర్స, పార్టీ మండల అధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ పైల సునీల్, జిల్లా కమిటీ సభ్యులు కరక అప్పలరాజు, పైల పోతురాజు, వేముల సూరిబాబు, గునుపూడి సర్పంచ్ వేముల సూర్యనారాయణ, గుమ్మడిగొండ ఎంపీటీసీ సుర్ల అచ్చియ్యనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

150 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం


మాట్లాడుతున్న ఏపీవో కొండాజీ

నాతవరం: మండలంలో ఈ ఏడాది ఉపాధి హామీ పథకం నిధులతో 150 ఎకరాల్లో పండ్ల తోటలు పెంచేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని ఉపాధి హామీ పథకం ఏపీవో దాసరి కొండాజీ తెలిపారు. మర్రిపాలెం గ్రామ సచివాలయంలో మంగళవారం వ్యవసాయాధికారి శైలజతో కలిసి జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సన్న, చిన్న కారు రైతులు మెట్ట భూముల్లో 100 శాతం రాయితీపై పండ్ల తోటల పెంపకం చేపట్టవచ్చన్నారు. మండల వ్యాప్తంగా సర్వే చేసి నిబంధనలు ప్రకారం అర్హత ఆధారంగా ఐదెకరాల్లోపు భూములు ఉన్న రైతులను గుర్తించామన్నారు. ఆయా రైతులకు పండ్ల తోటలు పెంచేందుకు మూడేళ్ల పాటు ఉపాధి హామీ పతకం నిధులు మంజూరు చేస్తామన్నారు. వర్షా కాలంలో ఉచితంగా మొక్కలు పంపిణీ చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన


రైతులకు సబ్సిడీపై నవధాన్యాల విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయాధికారులు

చోడవరం: ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల రైతులకు మంచి పంట దిగుబడి వస్తుందని మండల వ్యవసాయాధికారి పావని సూచించారు. మండలంలో దాముసాపల్లి గ్రామంలో సర్పంచ్ బలిరెడ్డి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న సమయంలో రైతులకు ప్రకృతి వ్యవసాయం ద్వారా కలిగే ఉపయోగాలను ఈ సందర్భంగా వివరించారు. తొలకరి వర్షాలకు ముందే ప్రకృతి వ్యవసాయం విధానంలో భూమిని సంరక్షిస్తే ఏడాదంతా పంటకు మేలు చేస్తుందని సూచించారు. నవ ధాన్యాలు సాగు చేయడం వల్ల పశువులకు మంచిన పోషకాహారం కూడా లభిస్తుందన్నారు. నేల గుల్లబారి వానపాములు అభివృద్ధి చెందుతాయని, నేలలో నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందన్నారు. మిశ్రమ పంటలు వేయడం వల్ల రైతులకు అదనపు ఆదాయం వస్తుందని, పంట దిగుబడి బాగా వస్తుందని ఆమె సూచించారు. ఈ సందర్భంగా రైతులకు సబ్సిడీపై అపరాలు, నవధాన్యాల విత్తనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్ఏ నాగమణి, చిన్న, నాయుడుబాబు, కె.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

రజకుల సమస్యలు పరిష్కరించాలి

చోడవరం: రజకుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని రజక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. చోడవరంలో జిల్లా రజక సంఘం సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా పలు డిమాండ్ల పరిష్కారం కోరుతూ సమావేశం తీర్మానించింది. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని, రజక వృత్తి చేస్తున్నవారికి ఇంటి స్థలాలు మంజూరు చేయాలని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ధోబీ ఉద్యోగాలు ఇవ్వాలని, ప్రతి మండలంలో సామాజిక భవనం నిర్మించాలని, రజక కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేయాలని కోరారు. 50 ఏళ్లు దాటిన వారికి పింఛన్లు ఇవ్వాలని, అసంపూర్తిగా నిలిచిపోయిన ధోబీఘాట్ల నిర్మాణం వెంటనే పూర్తిచేయాలన్నారు. చోడవరంలో కల్యాణ మండపం నిర్మించాలని, 250 యూనిట్ల లోపు విద్యుత్‌ను ఉచితంగా ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో సంఘ నాయకులు జొన్నాడ మోహన్‌రావు, రాజమండ్రి నారాయణరావు, కొంకోట జయనాథ్, రుకనా నూకరాజు, అడ్డూరు శంకరరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.